టీఎస్ఆర్టీసీకి ఎన్నికల 'గిరాకీ'

- నెల రోజుల్లో 12 వేల వాహనాలు బుక్
- ఒక్కో బస్సుకు సగటున 20 వేల ఆదాయం

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు టీఎస్ ఆర్టీసీకి మంచి ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి. గత నెల రోజుల్లోనే రాజకీయ పార్టీలు తమ సభలకు సుమారు 12 వేల వరకు బస్సులను బుక్ చేసుకున్నాయి. దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి పండుగలతోపాటు న్యూఇయర్ వేళ ఎక్కువ మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా సంస్థ 100 రోజుల ఫెస్టివల్ చాలెంజ్ పేరుతో సిబ్బందికి ప్రత్యేక లక్ష్యాలను కేటాయించింది. దీనిలోనే ఎన్నికల అంశాన్ని కూడా చేర్చింది. దీంతో 100 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో ఒక్కో బస్సుకు రూ.20 వేల నుంచి రూ.24 వేల వరకు ఆదాయం సమకూరనున్నది. ప్రస్తుతం దసరా పండుగ రద్దీ అధికంగా ఉన్నది. మరమ్మతుల కోసం డిపోలకే పరిమితమైన బస్సులనూ సిద్ధం చేసి రోడ్లపై తిప్పుతున్నారు. గత నెల కొల్లాపూర్‌లో సీఎం కేసీఆర్ సభకు 2 వేల బస్సులను, ప్రధాని మోదీ మహబూబ్‌నగర్‌లో, నిజామాబాద్‌లో నిర్వహించిన సభలకు 2 వేల బస్సులను బీఆర్ఎస్, బీజేపీ నేతలు బుక్ చేశారు. ఇటీవల రాహుల్ సభలకూ ఆర్టీసీ బస్సులను బుక్ చేశారు. ఇటీవల సీఎం కేసీఆర్ పాల్గొన్న సిరిసిల్ల, జడ్చర్ల, భువనగిరి, సిద్దిపేట సభలకూ కొన్ని ఆర్టీసీ బస్సులను వినియోగించారు. బీజేపీకి చెందిన కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా పాల్గొన్న సభల్లో కూడా కొన్ని బస్సులు వినియోగించారు. ఇలా గత నెలరోజుల్లో అన్ని రాజకీయ పార్టీలు దాదాపు 12 వేలకు పైగా బస్సులను బుక్ చేసుకున్నట్టు సమాచారం. ఇంకో నెలరోజుల పాటు ఎన్నికల ప్రచార సభలు ఉండటంతో ఆర్టీసీకి మరింత ఆదాయం సమకూరే అవకాశం ఉన్నది.

చీమలు కుట్టినా ఆరోగ్య సమస్యలే!

- దేశంలోనే తొలిసారి 'రెడ్ యాంట్ ఎలర్జీ' గుర్తింపు
- అశ్వినీ అలర్జీ క్లినిక్ వైద్యుడు నాగేశ్వర్‌రావు వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): చీమలు కుట్టినా అలర్జీ వస్తుందట! దేశంలోనే తొలిసారి ఈ విషయం నిర్ధారణ అయినట్టు అశ్వినీ అలర్జీ క్లినిక్ వైద్యుడు డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్‌రావు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల ఓ ఐటీ ఉద్యోగి (28) తన ఇంట్లో గార్డెనింగ్ చేస్తున్నప్పుడు కాళ్లపై ఎర్రచీమలు కుట్టాయి. అరగంట తర్వాత ఆయనకు కంటి దురద, గొంతులో దురద, గొంతు మారడం, చర్మంపై దద్దుర్లు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, పెదాలతోపాటు చెవి వద్ద వాపు రావడం, బీపీ తగ్గడం లాంటి సమస్యలు తలెత్తడంతో కుటుంబసభ్యులు సమీపంలోని దవాఖానకు తరలించారు. ఆయన అలర్జిక్ అర్టిటేరియాతో బాధపడుతున్నట్టు వైద్య పరీక్షల్లో తేలడంతో డాక్టర్లు అత్యవసర చికిత్స అందించారు. దీంతో కోలుకున్న ఆ వ్యక్తిని 20 రోజుల తర్వాత ఇంట్లో చీమలు కుట్టడంతో మళ్లీ అవే సమస్యలు తలెత్తాయి. ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు ఆయనను హైదరాబాద్‌లోని అశ్విని అలర్జీ సెంటర్‌కు తీసుకురాగా.. 'రెడ్ యాంట్ ఎలర్జీ' బారిన పడినట్టు వైద్యపరీక్షల్లో తేలింది. దీంతో ఆయనకు ఎర్ర చీమల ఇమ్యునో థెరపీని ప్రారంభించి ఎపిపెన్ (ఎస్ఒఎస్) ఇంజెక్షన్ ఇవ్వడంతో పాటు యాంటీ హిస్టమైన్స్, బ్రాంకో డిలేటర్ చికిత్సలు చేసినట్టు డాక్టర్ నాగేశ్వర్‌రావు వివరించారు. దేశంలో 'రెడ్ యాంట్ అలర్జీ'ని గుర్తించడం ఇదే తొలిసారని, ఈ ఎలర్జీకి గురైనవారు సకాలంలో సరైన చికిత్స తీసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని ఆయన తెలిపారు.

వంగవీటి దంపతులకు తోట ఆశీర్వాదం

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): దివంగత వంగవీటి మోహనరంగా తనయుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ-పుష్పవల్లి దంపతులను బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ తోట చంద్రశేఖర్ ఆశీర్వదించారు. విజయవాడలో ఆదివారం వారి పెండ్లి జరుగగా, తోట హాజరయ్యారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన రంగా తనయుడు ఓ ఇంటివాడు కావడం సంతోషంగా ఉన్నదని తోట ఆనందం వ్యక్తం చేశారు.